క్లుప్తంగా

గ్లోబల్ రీసైక్లింగ్‌పై శిక్షణ

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో సోమవారం గ్లోబల్ రీసైక్లింగ్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. విద్యార్థులు చెత్తను డబ్బాలో వేయాలని, తడి, పొడి, హానికర చెత్తను వేరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అయోధ్యరెడ్డి, బేసిల్ ఫౌండేషన్ ప్రతినిధి ఉదయ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, జంతుశాస్త్ర అధ్యాపకులు విశ్వనాథం, మధుసూదన్‌రెడ్డి, వైకుంఠం, పుణ్యమ్మ, రామ్ కుమార్, వెంకటేశ్, పల్లవి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రజాసేవకుడు బొమ్మ వెంకటేశ్వర్లు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు మంచి ప్రజా సేవకుడని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. సోమవారం వెంకటేశ్వర్లు వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ బొమ్మ వెంకటేశ్వర్లు పార్టీలకతీతంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన వల్లే హుస్నాబాద్‌కు కోర్టు వచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, కౌన్సిలర్లు వల్లపు రాజు, సరోజన, నాయకులు ఎండీ హుస్సేన్, అక్కు శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, కవ్వ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

20న ధర్మసభ

కొమురవెల్లి(సిద్దిపేట): జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా సద్గురు మహదేవ్ స్వామి ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుడిమెట్ గ్రామం నుంచి ఇటీవల ప్రారంభమైన రేణుకాచార్య మహాపాదయాత్ర కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాస్థానం మీదుగా యాదాద్రి జిల్లాలోని కొలనుపాలకు చేరనుంది. ఈయాత్రలో భాగంగా కొమురవెల్లి ఆలయం వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 20న ధర్మసభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు సురేశ్‌షెట్కార్, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, శివప్ప, మహదేవుని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరవ్వనున్నట్లు తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి శివారులోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామశివారులోని దేవాలయం వద్ద ఆదివారం గ్రామస్తులు పూజలు నిర్వహించి సాయంత్రం వరకు అక్కడే గడిపి ఆలయానికి తాళంవేసి వెళ్లారు. సోమవారం అటుగా వెళ్లే రైతులు ఆలయం తలుపులు తెరిచిఉండడం గమనించారు. పరిసరాలను పరిశీలించగా దూరంలో హుండీ పగులగొట్టి ఉండడం గుర్తించారు. అలాగే అమ్మవారి ముక్కు పుడక, చెవుల కమ్మలు, పుస్తె చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో గౌడ సంఘం నాయకులు తొగుట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ లింగం క్లూస్ టీంతో అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ స్పష్టంచేశారు.

రోడ్డులేక ఇబ్బందులు



మాట్లాడుతున్న కాలనీవాసులు

సిద్దిపేటకమాన్: పట్టణంలో ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. హౌజింగ్ బోర్డు కాలనీలో పదేళ్ల నుంచి ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, కొంత మంది తమకు రోడ్డు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. అడ్డుకున్నందుకు కేసులు పెట్టారన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు తిరుపతి, రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకులకు వాలీబాల్ కిట్లు

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఆదర్శ ఆస్పత్రి వైద్యులు అనిల్ కుమార్‌రెడ్డి సోమవారం మండలంలోని వీరాపూర్ గ్రామ యువకులకు రెండు వాలీబాల్ కిట్లు అందజేశారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు చాలాచోట్ల సోమవారం తమతమ పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయానికంటే గంటముందే చేరుకున్నారు. ముందుగా సిటింగ్ అరేంజ్‌మెంట్ చూసుకుని ఉత్సాహంగా కేంద్రాలకు హాజరయ్యారు. అధికారులు విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీరు, వైద్య శిబిరాలను నెలకొల్పారు. పరీక్ష కేంద్రాల దగ్గరలోని జెరాక్స్, ఇతర దుకాణాలను మూయించారు.



వర్గల్(గజ్వేల్): పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థులు



హుస్నాబాద్: బాలికల ఉన్నత పాఠశాల వద్ద..



మిరుదొడ్డి(దుబ్బాక): పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



చిన్నకోడూరు(సిద్దిపేట): గాయపడ్డ విద్యార్థిని తీసుకువస్తూ..



అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న నాయకులు



గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్ పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు



దుబ్బాకటౌన్: పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లడానికి క్యూకట్టిన విద్యార్థులు



చేర్యాల(సిద్దిపేట): మోడల్ స్కూల్ వద్ద విద్యార్థుల కోలాహలం



కొమురవెల్లి(సిద్దిపేట): సిటింగ్ అరేంజ్‌మెంట్ చూసుకుంటున్న విద్యార్థులు



మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు పరీక్షలపై సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

ఎంపీఓపై దాడికి నిరసనల వెల్లువ

- ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మండల పరిషత్ సిబ్బంది డిమాండ్

కోహెడ(హుస్నాబాద్): నాగర్ కర్నూల్ జిల్లా కోడేల మండలం ఎంపీఓపై జరిగిన దాడిని నిరసిస్తూ మండల పరిషత్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.సురేశ్ మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపిస్తోంది పంచాయతీశాఖ సిబ్బందేనన్నారు. అలాంటి శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎంపీఓపై అక్కడి మండల పరిషత్ అధ్యక్షుడు దాడికి పాల్పడడం అమానుషం అని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడికి పాల్పడిన ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.కృష్ణయ్య, కార్యాలయ పర్యవేక్షకుడు మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులు..

హుస్నాబాద్‌రూరల్: ఏపీఓపై ఎంపీపీ దాడి చేసిన ఘటనకు నిరసనగా అక్కన్నపేట, హుస్నాబాద్ ఉద్యోగులు నల్లా బ్యాడ్జీలు ధరించి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘనాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే అధికారులపై ఎంపీపీ దాడిచేయడం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మోహన్, కవికుమార్ పాల్గొన్నారు.



కోహెడ(హుస్నాబాద్): నిరసన వ్యక్తం చేస్తున్న మండల పరిషత్ సిబ్బంది

నల్లబ్యాడ్జీలతో నిరసన

ములుగు(గజ్వేల్): స్థానిక ఎంపీపీ కార్యాలయం ఎదుట సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట శ్రీరామకృష్ణశర్మ, సూపరింటెండెంట్ రామచంద్రం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ములుగు(గజ్వేల్): ఉద్యోగుల ఆందోళన..

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎంపీడీఓ లక్ష్మప్ప ఆధ్వర్యంలో సిబ్బంది చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎంపీఓ విష్ణువర్ధన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం

సీడీపీఓ శారద

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 9 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల ఆధ్వర్యంలో సోమవారం పోషణ పక్వాడ పక్షోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక కుర్మవాడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీఓ శారద, సూపర్‌వైజర్ నాగమణి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిస్తారన్నారు. ప్రతిరోజు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. ప్రీ స్కూల్ స్థాయికి వచ్చే పిల్లలను ఐదేళ్ల వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తే ఆటపాటలతో పాటు విద్య నేర్పిస్తామని చెప్పారు. అనంతరం చిరుధాన్యాలపై తల్లులు, కిశోర బాలికలు, వృద్ధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ టీం కనకరాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో..

కొమురవెల్లి(సిద్దిపేట): గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని పిలుపునిచ్చారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని తల్లులకు సూచించారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే బాలింతలు, గర్భిణులకు రక్తహీనత నివారించడమే కాకుండా పుట్టబోయే బిడ్డకు మంచి ఎదుగుదల ఉంటుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మురళి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తుకారం, తల్లులు, కిషోర బాలికలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చేర్యాల(సిద్దిపేట): ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ శారద తదితరులు

విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు

- ఎన్నికల నియమావళి పాటించాలి
- సీఐ ఎల్.శ్రీను



చేర్యాల(సిద్దిపేట): పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు మానసిక ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని సీఐ ఎల్.శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 500 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ వర్తిస్తుందని, అయిదుగురు కానీ అంతకు ఎక్కువ మంది గుమిగూడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్ని కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అమలులోకి ఎన్నికల కోడ్

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, అందులో భాగంగా బార్డర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ డబ్బు వెంట తీసుకెళ్లొద్దని, అత్యవసరమైతే సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. అందరూ ఎన్నికల నియామవళి తప్పకుండా పాటించాలని చెప్పారు. అనుమతులు లేకుండా గోడలపై రాతలు రాయడం, ఫ్లెక్సీలు పెట్టవద్దని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సీపీ అనురాధ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరుగుతాయని తెలిపారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు స్థానిక పోలీసుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రచారంలో భాగంగా నిర్వహించే సమావేశాలకు, ప్రచారాలకు మైక్ అనుమతి తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీటితొట్లు.. జీవాల పాట్లు

- అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగం
- దాహార్తితో అల్లాడుతున్న పశువులు



పిచ్చి మొక్కలతో నిండిన నీటితొట్టి

చిన్నకోడూరు(సిద్దిపేట): వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చడానికి గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి గ్రామాల్లో నీటితొట్లు నిర్మించింది. సంబంధిత అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో వాటిని పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో అవి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మూగజీవాలకు నీరుదొరకని పరిస్థితి నెలకొంది. నీటితొట్లలో నీరు పెడదామంటే పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయాయని పశుపోశకులు ఆందోళన చెందుతున్నారు. నీటి వసతిని కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

చున్నీని అనుమతించని విద్యాధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): పదోతరగతి పరీక్ష కేంద్రానికి విద్యార్థినుల చున్నీలతో రాగా విద్యాధికారులు అనుమతించలేదు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో నిర్వహిస్తున్న పదోతరగతి పరీక్షల కేంద్రం వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. దీంతో విద్యార్థులు పరీక్షల కేంద్రం వద్ద నుంచి వెనక్కువచ్చి తమ కుటుంబ సభ్యులకు చున్నీలను ఇచ్చి, పరీక్ష రాయడానికి వెళ్లారు. ఇదే విషయంపై జెడ్పీపాఠశాల చీఫ్ ఎగ్జామీనర్ రవీందర్‌రెడ్డిని ప్రశ్నించగా ఉన్నత అధికారుల నుంచి తమకు అందిన సూచన మేరకు చున్నీలను నిరాకరిస్తున్నట్లు తెలిపారు.



చున్నీలు లేకుండా వెళ్తున్న విద్యార్థినులు

లైసెన్స్‌డ్ తుపాకులు అప్పగించాలి

పోలీసు కమిషనర్ అనురాధ



సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందు వల్ల లైసెన్స్ ఉన్న తుపాకులను స్థానిక పోలీసు స్టేషన్‌లలో అప్పగించాలని పోలీసు కమిషనర్ అనురాధ పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 25వ తేదీలోపు తుపాకులు అప్పగించాలన్నారు. డిపాజిట్‌చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 10 చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ ప్రారంభించామని, ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ప్రజలు, నేతలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు.

ఇసుక డంప్ పట్టివేత

మినీ టిప్పర్, జేసీబీ సీజ్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం, బేగంపేట గ్రామాల్లో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంప్‌ను, అలాగే మినీ జేసీబీ, టిప్పర్‌లను సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు సీజ్ చేశారు. సిద్దిపేటకు వాహనాల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత..

కొండపాక(గజ్వేల్): అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, టిప్పరును సీజ్ చేసినట్లు కుకునూరుపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామ శివారులో మల్లన్న సాగర్ నుంచి కొండపోశమ్మ తల్లి రిజర్వాయర్‌లోకి నీరు వెళ్లేందుకు కాలువను తవ్వకాలు జరిగాయి. కొందరు అక్రమార్కులు జేసీబీ సహాయంతో టిప్పర్లలో మట్టిని లోడ్‌చేసుకొని ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారన్న సమాచారం మేరకు సోమవారం ఆర్‌ఐ సత్యనారాయణతో పాటు సిబ్బంది తనిఖీలు చేశారు. ముద్దాపూర్ శివారులో కాలువ పక్కన డంప్ చేసిన మట్టిని టిప్పరులోకి లోడ్ చేస్తుండగా జేసీబీతో పాటు టిప్పర్‌ను పట్టుకొని సీజ్ చేసి పోలీస్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.



టిప్పర్‌తో టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సహాయం అందజేత



దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డుకు చెందిన కాజీపురం లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బరాజయ్య, కనకయ్య, మల్లేశం, శ్రీకాంత్ తదితరులున్నారు.

◆ కవితను విడుదల చేయాలి

సిద్దిపేటకమాన్: ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో, నిరసన నిర్వహించారు. కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని, ఆమెను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ నేడు ఐనాపూర్‌లో మెగా వైద్య శిబిరం

సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ (ఎవరెస్ట్ హైదరాబాద్) సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్యశిబిరం క్యాంప్ నిర్వహిస్తున్నారు. అయినాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని సంస్థ కార్యదర్శి జిల్లా రవీందర్ పేర్కొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గుండె, పంటి, నేత్ర, మధుమేహ, అధికరక్తపోటు.. లాంటి అన్ని రకాల సమస్యలకు పరీక్షలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈసీజీ, టూడీ ఎకో, ఇతర సాధారణ వైద్య పరీక్షలు కూడా చేయనున్నట్టు రవీందర్ తెలిపారు.

◆ 3 నెలలుగా అందని వేతనాలు

సిద్దిపేటకమాన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆస్పత్రి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు ఆసుపత్రి సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

◆ మంత్రిని కలిసిన గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు గిరిధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఉన్నారు.

◆ కళ్లద్దాల పంపిణీ

జహీరాబాద్ టౌన్: శాంతినగర్‌కు చెందిన పలువురికి ఉచితంగా కళ్లద్దాలను సోమవారం పంపిణీ చేశారు. డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో మెగా వైద్య శిబిరం నిర్వహించి 1200 మంది పరీక్షలు నిర్వహించారు. కొంతమంది నేత్రవ్యాధులతో బాధపడుతున్నారని గుర్తించారు. వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

◆ సన్మాన సభను విజయవంతం చేయండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్‌గా నియమితులైన డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి ఆత్మీయ అభినందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19న మంగళవారం పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

◆ పరీక్షలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

వట్‌పల్లి(అందోల్): పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరైనా పరీక్షలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 144 ఆంక్షలు అమలులో ఉండడంతో పరీక్ష కేంద్రాల సమీపంలో ఎవరూ గుమికూడరాదన్నారు. కొందరూ వ్యక్తులు రిపోర్టర్లుగా చెప్పుకుని పరీక్ష కేంద్రాల వద్ద బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. నకిలీ విలేకరులుగా తేలితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు.

◆ ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో మల్లికార్జున స్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.